క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా



జగ్గయ్యపేట అర్బన్: కూటమి ప్రభుత్వం ట్రూ అప్ చార్జీల పేరుతో భారీ స్థాయిలో విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేయనున్నట్లు ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వర రావు మంగళవారం తెలిపారు. చిల్లకల్లులోని 220 కేవీ, 33/11 కేవీ సబ్‌స్టేషన్ల వద్ద ఉదయం పదిగంటలకు ధర్నా చేపడుతున్నట్లు వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలను పెంచబోమంటూ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. విద్యుత్ చార్జీల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నియోజకవర్గంలోని వైఎస్సార్ కాంగ్రెస్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన



ముండ్లపాడు క్రాస్‌రోడ్స్(పెనుగంచిప్రోలు): ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ ఎంఎస్‌కె అర్జున్ సూచించారు. స్థానిక ముండ్లపాడు క్రాస్‌రోడ్స్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఆయన ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరిస్తే ప్రమాద సమయాల్లో ప్రాణాలు కోల్పోకుండా కాపాడుకోవచ్చన్నారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, అలా నడిపితే వారి తల్లిదండ్రులపై కూడా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆటోల్లో కూడా పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వాహనదారులకు బహుమతులు అందజేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు చేపట్టాలి



మక్కపేట(వత్సవాయి): కత్తెర పురుగు పంట అన్ని దశల్లో ఆశిస్తుందని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.అచ్యుతరాజు, సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.రాజశేఖర్ తెలిపారు. మండలంలోని మక్కపేటలో మొక్కజొన్న పంటను పరిశీలించారు. రైతులకు మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణ చర్యల్లో భాగంగా లింగార్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లెల శివ, విస్తరణ విభాగ శాస్త్రవేత్త ఐ.వెంకటరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండబోలు నాగేశ్వరరావు, వ్యవసాయ సిబ్బంది జి.శోభిత, వై.సాయిగోపి, ఎ.దివ్య, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణ



పెనుగంచిప్రోలు: సాగునీటి సంఘాల ఎన్నికలను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ శాంతిలక్ష్మి అన్నారు. ఈనెల 8న జరుగనున్న సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై స్థానిక రామాలయం వద్దనున్న ఫంక్షన్‌హాల్‌లో ఎన్నికల సిబ్బందికి మంగళవారం శిక్షణనిచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 18 నీటి సంఘాలు ఉండగా, జగ్గయ్యపేటలో 4, పెనుగంచిప్రోలులో 7, వత్సవాయి మండలంలో 7 నీటి సంఘాలు ఉన్నాయన్నారు. ఈ సంఘాల్లో మొత్తం 40వేల మందికి పైగా ఓటర్లు ఉన్నారన్నారు. డిసెంబర్ 8న సాగునీటి సంఘాలకు, 11న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 14న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సభ్యులందరూ తప్పక ఓటును వినియోగించుకోవాలన్నారు. ప్రభుత్వం ఇందుకోసం తగు ఏర్పాట్లు చేసిందన్నారు. అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా పనిచేసి ఎన్నికలు సజావుగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఎన్ఎస్‌పీ ఏఈ బి గోపి, వివిధశాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కంచికచర్ల: పేకాట ఆడినా, నిర్వహించినా కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ బోనగిరి రాజు హెచ్చరించారు. మండలంలోని గొట్టుముక్కల ఏనుగు గడ్డ వాగు సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఎస్‌ఐ మాట్లాడుతూ పేకాట ఆడుతున్న సమాచారం అందడంతో తమ సిబ్బందితో నిఘా వేసి పట్టుకున్నామని వారి నుంచి రూ.3వేల నగదు, ఐదు సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను బుధవారం నందిగామ కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు

ఆలయ అభివృద్ధిలో దాతలు

- శ్రీతిరుపతమ్మవారి ఆలయ అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం..
- రూ.1కోటితో విశ్రాంతి మందిర నిర్మాణం
- చురుగ్గా సాగుతున్న పనులు
- రూ.70లక్షలతో నాలుగు ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు



శ్రీతిరుపతమ్మ ఆలయం వద్ద నిర్మాణంలో ఉన్న భక్తుల విశ్రాంతి మందిరం

పెనుగంచిప్రోలు: రెండు తెలుగు -రాష్ట్రాల ప్రజలచే విశేష పూజలందుకుంటున్న పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీతిరుపతమ్మవారి ఆలయ అభివృద్ధిలో భక్తులు కూడా భాగస్వాములు అవుతున్నారు. ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా భక్తుల భాగస్వామ్యంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆలయ పాలకవర్గం, అధికారులు కృషి చేస్తుండగా..దాతలు ఇతోధికంగా సహకరిస్తూ ఆలయ అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారు.

రూ.కోటితో విశ్రాంతి మందిరం...

అమ్మవారి ఆలయం వద్ద భక్తులు రాత్రుళ్లు నిద్రించి తెల్లవారుజామున మునేరులో స్నానమాచరించి పాలు, పొంగళ్లతో అమ్మవారిని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఆలయం వద్ద విశ్రాంతి మందిరం లేక పోవటంతో భక్తులు ఆరుబయట నిద్రించాల్సి వస్తోంది. దీంతో భక్తుల ఇబ్బందులు దృష్ట్యా హైదరాబాద్‌కు చెందిన అమ్మవారి భక్తులు చిన్నం యాగయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నరేష్, అల్లుడు తెల్లమేకల శ్రీను ఒక కోటి రూపాయలతో అత్యాధునిక సదుపాయాలతో విశ్రాంతి మందిరం నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం విశ్రాంతి మందిరం శ్లాబ్ పనులు పూర్తయ్యాయి. విశ్రాంతి మందిరంపైన గదుల నిర్మాణం కూడా చేపడతామని ఆలయ అధికారులు చెబుతున్నారు.

రూ.70లక్షలతో ఆర్వో ప్లాంట్లు....

భక్తులకు పరిశుద్ధమైన తాగునీటిని అందించేందుకు హైదరాబాద్‌కు చెందిన దివీస్ ల్యాబ్స్ సంస్థ వారి రూ.70లక్షలతో నాలుగు వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. ఆ సంస్థ తమ సీఎస్ఆర్ నిధులతో ఆలయ బేడా మండపం లోపల రెండు ప్లాంట్లు, ఆలయం చుట్టూత రెండు ప్లాంట్లు ఏర్పాటు చేసింది. దీంతో భక్తులకు స్వచ్ఛమైన తాగునీరు అందుతోంది.



ఆలయం వద్ద దివీస్ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటు

రూ.1.50కోట్ల అంచనాలతో ఫ్లోరింగ్..

ఆలయం చుట్టూతా గ్రానైట్ కట్ స్టోనింగ్ ఫ్లోరింగ్ వేయించాలని ఆలయ అధికారులు నిర్ణయించారు. భక్తులు నడిచేటప్పుడు జారిపడిపోకుండా ఉండేందుకు స్టోనింగ్ ఫ్లోరింగ్ ఏర్పాటు చేసేందుకు రూ.1.50కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఇందుకోసం దాతల సహకారం తీసుకుంటున్నారు. అలాగే ఉపాలయం అంకమ్మవారి గోపురం వెండి తాపడం తయారీకి కూడా భక్తులు వెండి, నగదు రూపంలో విరాళాలు అందజేస్తున్నారు. ఇలా శ్రీతిరుపతమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధిలో భక్తులు కీలక పాత్ర పోషిస్తున్నారు.

దాతల సహకారం మరువలేనిది..



ఆలయ అభివృద్ధిలో భక్తుల సహకారం మరువలేనిది. ఇప్పటికే దాతల సహకారంతో విశ్రాంతి మందిరం నిర్మాణం చేపట్టాం. ఆలయ ప్రాంగణంలో భక్తులకు శుద్ధి చేసిన జలాన్ని అందిస్తున్నాం. దాతల సహకారంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– భూపతిరాజు వెంకట సత్య నాగ కిషోర్‌కుమార్, ఆలయ ఈవో

జగనన్నకాలనీకి మంచినీటి పైపులైన్



తాగునీటి పైపులైన్ పనులను పరిశీలిస్తున్న గండేపల్లి సర్పంచ్ రవికుమార్

కంచికచర్ల: రక్షిత మంచినీటి పథకం గండేపల్లిలోని అన్నివీధులకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బి.రవికుమార్ తెలిపారు. మండలంలోని గండేపల్లి జగనన్న కాలనీలో తాగునీరు సరఫరా కోసం మంగళవారం పైపులైన్ ఏర్పాటు చేశారు. ఈ పనులను పర్యవేక్షించిన అనంతరం సర్పంచి మాట్లాడుతూ గత ప్రభుత్వహయాంలో జగనన్నకాలనీలో తాగునీటి పైపులైన్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయగా, నిధులు కూడా మంజూరయ్యాయని అన్నారు. కాని ఎన్నికలు రావడంతో పైపులైన్ అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. త్వరలోని జగనన్నకాలనీలో తాగునీటి పైపులైన్ పనులు పూర్తిచేసి త్వరితగతిన తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న ఎన్ఎస్పీ డీఈ శ్రీవాత్సవ



చిల్లకల్లులో శిక్షణ తరగతులకు హాజరైన సిబ్బంది

వీరులపాడు: సాగునీటి సంఘ ఎన్నికలలో విధులు నిర్వహించే ఉద్యోగులు నిస్పక్షపాతంగా వ్యవహరించాలని తహసీల్దార్ హుస్సేన్, ఎన్ఎస్పీ డీఈ శ్రీవాత్సవ సూచించారు. జుజ్జూరు గ్రామంలోని జెల్లి ఏసోబు కళ్యాణ మండపంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు, సిబ్బందికి మంగళవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి సంఘ ఎన్నికలకు ఈ నెల ఐదున నోటిఫికేషన్ వస్తుందని, ఎనిమిదో తేదీన ఎన్నికలు జరుగుతాయన్నారు. మండలంలోని తొమ్మిది మేజర్, తొమ్మిది మైనర్ ఇరిగేషన్‌లకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేజర్ ఇరిగేషన్‌లో ఒక్కో మేజర్‌కు 12 మంది టీసీలు, మైనర్ ఇరిగేషన్ తొమ్మిది ట్యాంకులకుగాను ఒక్కో ట్యాంకుకు ఆరుగురు టీసీలను ఎన్నుకుంటారని తెలిపారు. పట్టాదార్ పాస్ పుస్తకం ఉండి 18 ఏళ్లు నిండినవారు ఎన్నికలలో పోటీ చేయవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్పీ ఏఈ నరేష్, ఎంపీడీవో అరుంధతీ దేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట మండలంలో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్ మాట్లాడుతూ మండలంలో ఆరు సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా, మొత్తం 68 టీసీలున్నట్లు తెలిపారు. ఐదున నోటిఫికేషన్ వస్తుందని ఎనిమిదిన ఎన్నిక జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ జేఈలు రామనరసింహ, వెంకట్ పాల్గొన్నారు.

ప్రతి గింజ కొనుగోలు చేస్తాం : ఆర్డీవో బాలకృష్ణ



వీరులపాడులో కల్లంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ



షేర్‌మహ్మద్‌పేటలో కల్లంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వీరులపాడు: రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ఆర్డీవో బాలకృష్ణ తెలిపారు. వీరులపాడులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ మండలంలోని జయంతి, వెల్లంకి గ్రామాల్లోని సహకార సంఘాల భవనాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించుకునే రైతులకు ప్రభుత్వం క్వింటాకు రూ.2320 గిట్టుబాటు ధర అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆయా గ్రామాలలో కల్లాల్లోని ధాన్యాన్ని ఆర్డీవో పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ హుస్సేన్, వ్యవసాయ శాఖ ఏవో జోగేంద్రప్రసాద్, సంఘ కార్యదర్శి చంద్ర నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

కల్లాల్లోని ధాన్యం పరిశీలన..

జగ్గయ్యపేట: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జగ్గయ్యపేట ఏడీఏ భవాని సూచించారు. మండలంలోని తక్కెళ్లపాడు, చిల్లకల్లు, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లోని ధాన్యం కల్లాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 15శాతం తేమ ఉన్న ధాన్యంను కూడా రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చన్నారు. కొన్ని గ్రామాల్లో మినహా ఈ ప్రాంతంలో వరి కోతలు పూర్తయ్యాయన్నారు. ధాన్యం కొనుగోళ్లపై గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ సహాయకులు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా మరో మూడు రోజులపాటు వర్షాలుండటంతో కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్ల వద్ద సమస్యలు ఎదురైతే తహసీల్దార్‌ను సంప్రదించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ మనోహర్, వీఏవో హారిక, వీఆర్వో బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



కంచికచర్ల: స్థానిక భవిత సెంటర్‌లో దివ్యాంగుల విద్యార్థులకు మంగళవారం విజయవాడకు చెందిన మౌషన్ దుప్పట్లు, టిఫెన్ బాక్సులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు మొండ్రు కనకారావు, భవితసెంటర్‌లో చదువుతున్న విద్యార్థులకు భోజన వసతి కల్పించటంతోపాటు అవసరమైన పరికరాలను అందజేస్తున్నామని అన్నారు. భవిత సెంటర్‌లోని 40మంది విద్యార్థులకు దుప్పట్లు, టిఫిన్ బాక్సులు అందజేసిన మౌషన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ ఉపాధ్యాయిని నాగమణి, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా పోలీసులకు ఏసీపీ అభినందనలు

నందిగామటౌన్: విజయవాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడా పోటీల్లో సబ్‌డివిజన్ పరిధిలోని మహిళా పోలీసులు ప్రతిభ కనబరచడం అభినందనీయమని ఏసీపీ తిలక్ అన్నారు. ఆయా పోటీల్లో ప్రతిభచూపిన మండలంలోని కేతవీరునిపాడు, చందాపురం, అడవిరావులపాడు గ్రామాల మహిళా పోలీసులను స్థానిక ఏసీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ మహిళలు కూడా పురుషులతో సమానంగా అన్ని రంగాలలో రాణించాలన్నారు. అనంతరం సీఐ కార్యాలయంలో సీఐ వైవిఎల్ నాయుడు, ఎస్ఐ అభిమన్యులు వారిని అభినందించారు. పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

చెస్‌లో సత్తా చాటిన విద్యార్థి

లబ్బీపేట(విజయవాడతూర్పు): సింగపూర్‌లో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన 2024 సింగపూర్ నేషనల్ ఏజ్ గ్రూప్ చెస్ చాంపియన్‌షిప్ అండర్ – 14 విభాగంలో నలంద విద్యానికేతన్‌లో చదువుతున్న 8వ తరగతి విద్యార్థి చిరాగ్ కొమ్మినేని సత్తా చాటాడు. ఆ పోటీల్లో ఫిడే రేటింగ్(1456 సాధించి, దానిలో 9 రౌండ్లకు గాను 4 1/2 పాయింట్లు సాధించి, ఇండియాకు చెందిన అక్షర గోబినాథ్(1441)తో పోటీపడి విజయం సాధించినట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ తెలిపారు. డిసెంబర్ 1న వరల్డ్ చెస్ ఫెడరేషన్(1456) ఈ రేటింగ్‌ను విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు.జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా తర్ఫీదు ఇస్తున్నట్లు తెలిపారు. చిరాగ్‌ను ప్రిన్సిపాల్, టీచర్లు, విద్యార్థులు అభినందించారు.

దివ్యాంగులకు ఉచిత న్యాయసహాయం



దివ్యాంగులతో జడ్జి శోభారాణి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

న్యాయమూర్తి ఎం. శోభారాణి

జగ్గయ్యపేటఅర్బన్: దివ్యాంగులకు అవసరమైన న్యాయ సహాయాన్ని ఉచితంగా అందిస్తామని జగ్గయ్యపేట అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక లయన్స్ క్లబ్ కమ్యూనిటీ భవన్‌లో స్వయంశక్తి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమాభివృద్ధి సంఘం, గాయత్రి మహిళా యోగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జడ్జి శోభారాణి మాట్లాడుతూ దివ్యాంగులు తమ హక్కులకు భంగం వాటిల్లినపుడు వారు నేరుగా కోర్టులో న్యాయం కోసం దరఖాస్తు చేసుకుంటే సత్వర న్యాయం జరిగేలా బాధ్యత తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో స్వయం శక్తి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వడ్డెపూడి ఉమామహేశ్వరరావు, లయన్స్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు జి.మహేష్, సూర్యయోగ ఫౌండేషన్ రాష్ట్ర వ్యవస్థాపకులు, స్వయం శక్తి ప్రమోటర్ డాక్టర్ కరణం ఉగేంద్ర పిళ్ళై గాయత్రీ మహిళా యోగ సంఘం అధ్యక్షురాలు సిరిపిరెడ్డి లీలావతి, స్వయంశక్తి సంఘ కార్యకర్తలు కొండపల్లి కోటేశ్వరరావు, బలుసుపాడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి..

దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) తెలిపారు. స్థానిక సీతారామపురంలోని ఎంపీపీ స్కూల్‌లో ఉన్న భవిత కేంద్రంలో జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మాజీ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు పాల్గొన్నారు. దివ్యాంగులకు ఇటీవల నిర్వహించిన క్రీడాపోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. దివ్యాంగులకు ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు కె.రామలక్ష్మి, గొట్టె నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, నాయకులు పాల్గొన్నారు.

నందిగామలో..

నందిగామ టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బార్ అసోసియేషన్ కార్యదర్శి అద్దంకి మణిబాబు సూచించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేర్ సెంటర్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆజాద్, మౌలేశ్వరరావు, రామారావు, వెంకటేశ్వరరావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు మార్జిన్లు లెవలింగ్ చేయించాలి



7వ వార్డులో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మార్జిన్‌ను చూపిస్తున్న కౌన్సిలర్ మనోహర్

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్డు మార్జిన్లు ప్రమాదకరంగా మారాయని, వాటికి వెంటనే మట్టి తోలించి లెవెలింగ్ చేయించాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్ వట్టెం మనోహర్ డిమాండ్ చేశారు. ఇటీవల సంభవించిన వరదలకు వేపలవాగు పొంగిపొర్లడంతో ఏడోవార్డు ఆర్టీసీ కాలనీలో కొట్టుకుపోయిన సిమెంటు మార్జిన్లను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదలకు దెబ్బతిన్న రోడ్ల మార్జిన్లను లెవలింగ్ చేయిస్తామని మున్సిపల్‌చైర్మన్ రాఘవేంద్ర హామీ ఇచ్చారని, కాని ఇప్పటివరకు అటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనచోదకులు ప్రమాదాల బారినపడుతున్నారని తెలిపారు. ఇకనైనా మున్సిపల్ చైర్మన్, అధికారులు స్పందించి కొట్టుకుపోయిన రోడ్డు మార్జిన్లను లెవలింగ్ చేయించాలని ఆయన కోరారు.

కులగణన జాబితాను ఒకేసారి విడుదల చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రప్రభుత్వం కులగణన జాబితాను విడతలవారీగా కాకుండా ఒకేసారి విడుదల చేయాలని మాజీ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీల జాబితాలను ఒకేసారి విడుదల చేసి, ప్రజాభిప్రాయ సేకరణ కోసం గ్రామ సభలు నిర్వహించాలన్నారు. విడతల వారీగా జాబితాలను విడుదల చేయడంలో కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తంచేశారు. కులాలను విడగొట్టి లబ్ధి పొందాలనుకోవడం సమంజసం కాదని పేర్కొన్నారు. కులగణన జాబితాలను ఒకేసారి విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

హోటళ్ల యజమానులకు నోటీసులు



సీఎం రోడ్డులోని ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ రమణబాబు

నందిగామటౌన్: హోటల్ నిర్వాహకులు పరిశుభ్రత పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణబాబు హెచ్చరించారు. పట్టణంలోని పలు హోటళ్లను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోటల్ యజమానులు విధిగా ఫుడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. పలు హోటళ్లలో అపరిశుభ్ర వాతావరణాన్ని గమనించామని, వినియోగదారులకు ఇబ్బంది కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని యజమానులను హెచ్చరించారు. డ్రైనేజీలను కూడా ఆక్రమించుకుని వ్యాపారాలు సాగిస్తే సహించేది లేదన్నారు. హోటళ్ల నిర్వహణలో నిబంధనలు పాటించని నిర్వాహకులకు నోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీటీ జాతీయ పోటీలకు డీఎస్ఏ క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్‌డీవో అజీజ్

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ), సీబీఎస్‌సీ స్కూల్స్ జాతీయ, దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల టేబుల్ టెన్నిస్ పోటీలకు ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్ఏ) వద్ద శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు ఎంపికైనట్లు ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్.ఏ.అజీజ్ తెలిపారు. డీఎస్ఏ కోచ్ షేక్ ముంతాజ్ బేగం వద్ద ఇందిరా గాంధీ స్టేడియంలో శిక్షణ తీసుకుంటున్న జె.సుహాస్‌బాబు, పి.లాస్య ఎస్‌జీఎఫ్ఐ జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టుకు, షేక్ అబ్దుల్ రియాన్ జేఎన్‌టీయుకే జట్టుకు, ఎం.సునీత సీబీఎస్‌సీ స్కూల్ జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహించే రాష్ట్ర జట్టులో చోటు దక్కించుకున్నారన్నారు. ఈ సందర్భంగా డీఎస్ఏ కార్యాలయం వద్ద క్రీడాకారులను డీఎస్‌డీవో మంగళవారం అభినందించారు. జాతీయ పోటీల్లోనూ రాణించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపజేయాలని క్రీడాకారులకు సూచించారు.

అయ్యప్ప శరణుఘోషతో మార్మోగిన గ్రామాలు



ఇరుముడి కార్యక్రమంలో అయ్యప్ప దీక్షాపరులు

నందిగామ టౌన్: అయ్యప్ప దీక్షా స్వాముల ఇరుముడుల సందర్భంగా మండలంలోని పెద్దవరం, చెరువుకొమ్ముపాలెం, కేతవీరునిపాడు గ్రామాలు మంగళవారం అయ్యప్ప శరణు ఘోషతో మార్మోగాయి. వేకువజాము నుంచే ఆయా గ్రామాలలోని ఆలయాలలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. అయ్యప్ప దీక్షాపరులకు గురుస్వాములు ఇరుముడులు కట్టారు. అనంతరం అయ్యప్పలు ఇరుముడులతో శబరిమలకు బయలుదేరి వెళ్లారు. అయ్యప్ప మాలధారుల ఇరుముడుల సందర్భంగా తరలివచ్చిన బంధుమిత్రులతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.